లౌకిక ప్రజాస్వామిక విలువలు

(మహాసభలలో మొదటిరోజు విద్యాసదస్సులోని ప్రసంగపాఠం)

బాలగోపాల్

మన రాష్ట్రంలో విద్యార్థి, ఉపాధ్యాయ ఉద్యమాలు రెండూ చాలా కాలంగా నడుస్తున్నాయి. వివిధ పోకడలున్నప్పటికీ ప్రధానంగా లౌకిక ప్రజాస్వామిక విలువలను నమ్మిన ఉద్యమాలే ఉన్నాయి. సమాజంలో లౌకిక ప్రజాస్వామిక విలువలుండాలనీ, సమసమాజ దిశగా సమాజం పయనించాలనీ, అందుకనుగుణంగా విద్యావ్యవస్థ ఉండాలనీ విశ్వసించే విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు అనేక దశాబ్దాలుగా పనిచేస్తున్నాయి. ఉపాధ్యాయుల సర్వీసు సమస్యల గురించీ, రాజకీయనాయకుల, పెత్తందార్ల ఒత్తిళ్ళను అధిగమించటానికీ, విద్యార్థుల స్కాలర్‌షిప్‌లు, హాస్టళ్ళు, పాఠ్యపుస్తకాలు ఇంకా ఇతర సమస్యల గురించి ఈ సంస్థలు శక్తివంతమైన ఉద్యమాలు నిర్వహించి, విజయం సాధించాయి. అయితే విద్య యొక్క సారం (Content) గురించి, పాఠ్యాంశాలలో బోధిస్తున్న విషయం గురించీ, అందులోని నైతిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక స్వభావాన్ని గురించీ బలమైన ఉద్యమాలు జరగలేదు..

ఈ మధ్య కాలంలో కొంత తగ్గినప్పటికీ దక్షిణ భారతదేశంలోని పాఠశాలలో, విశ్వవిద్యాలయాలలో లౌకిక ప్రజాస్వామిక భావాలు గల రాజకీయ శక్తుల ప్రాబల్యమే ఎక్కువగా ఉంటూ వచ్చింది. అయినా దాని ప్రభావం పాఠ్యాంశాల మీద చాలా తక్కువగా ఉంది.

ప్రజాస్వామ్యం, లౌకికత,సామాజికన్యాయం అంటే ఏమిటి? ఈ పదాల నిర్వచనాలను కాంగ్రెస్ వాళ్ళకు వదిలివేశారు. వాళ్ళిచ్చిన నిర్వచనాలపై విమర్శలైతే చేశారు కాని, నిర్దిష్టమైన నిర్వచనాన్ని ఇవ్వడానికి ప్రయత్నించలేదు. ఆ నిర్వచనాలలో కొన్ని పాజిటివ్ అంశాలున్నప్పటికి వాటిపైన లోతైన చర్చ జరగలేదు. ఆ నిర్వచనాలన్నింటినీ తిరస్కరించి, ప్రజాస్వామ్య వ్యతిరేక, లౌకిక వ్యతిరేక ఎజెండాతో సంఘపరివార్, బి.జె.పి.లు ముందుకు వచ్చి దేశానికి ఒక షాక్‌నిచ్చాయి. సంఘపరివార్ శక్తులు, వాళ్ళ ఎజెండాను అమలు చేయటానికి ఏం చేయాలో సరిగ్గా గుర్తించారు. ఏ మాత్రం తటపటాయించకుండా పాఠ్యాంశాల దగ్గరే ప్రారంభించారు. ఏ మాత్రం అవకాశం వచ్చినా పాఠ్యాంశాలలో వాళ్ళ భావజాలాన్ని ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. వాళ్ళు స్కాలర్‌షిప్‌లు రద్దు చేయలేదు. హాస్టళ్ళ సంఖ్య తగ్గిస్తామనలేదు. సైద్ధాంతిక వ్యాప్తికి పాఠశాలలను కళాశాలలను ఆలంబనగా చేసుకున్నారు. తాము కోరుకునే భావితరాలను రూపొందించటానికి చిన్నారుల మెదళ్ళలో తమ ఆలోచనలను చొప్పించటానికి పాఠ్యాంశాలను తయారు చేస్తున్నారు. దానితో లౌకిక ప్రజాస్వామిక శక్తులలో ఆలోచన బయలుదేరింది. బి.జె.పి.ని పక్కకు నెట్టేశాం కాంగ్రెసు వచ్చింది కదా, చాలు. పాత పద్ధతులు తిరిగివస్తాయి అనుకోకుండా భావితరాలకు ఏ విధమైన విద్యనందించాలి, రూపంలోను, సారంలోను, విద్యాబోధన ఏవిధంగా ఉండాలి. లౌకిక ప్రజాస్వామిక విలువలను పెంపొందించడానికి ఏం చేయాలో ఆలోచించాలి.

విద్య యొక్క ప్రభావం విస్తృతంగా ఉంటుందని మనకు తెలుసు. చిన్నవయసులో నాటుకున్న భావాలు త్వరగా మారవు. అయితే అదే విధంగా ఎల్లకాలం ఉంటుందని చెప్పలేము. విద్య యొక్క ప్రభావం ఎలా ఉంటుందో ఆర్.ఎస్.ఎస్. వాళ్ళు దానిని ఎలా ఉపయోగించుకున్నారో గుజరాత్ అనుభవం మనకు తెలియచేస్తుంది. గుజరాత్‌లో జరిగిన దారుణాలపై పరిశీలనకు మేం వెళ్ళాం. ఆదివాసీల దగ్గరనుంచి కళాశాల విద్యార్థుల వరకు అందరూ ఒకే విధంగా స్పందించారు. భారతీయ సంస్కృతి గురించి, ముస్లిముల దాడుల గురించీ, వారు చిలకపలుకులు లాగా వల్లె వేస్తున్నారు. మీకీ విషయాలు ఎవరు చెప్పారని అడిగినప్పుడు మా మాష్టారు చెప్పారు అని ఆదివాసీలు చెప్పారు. వారితో వాదనకు దిగకుండా పరిశీలిస్తే, అనేక సంవత్సరాలుగా అధికారంలో ఉన్న సంఘపరివార్ శక్తులు తమకనుగుణమైన పాఠ్యాంశాలను బోధించటం వలన వారిపై ఆ ప్రభావం బలంగా ఉంది. ఎన్నికలలో ఎవరు గెలిచినా పాలనా యంత్రాంగంలో ఆర్.ఎస్.ఎస్. శక్తులు చొచ్చుకొనిపోయి ఉన్నాయి. ఒక మూసలో విద్యారంగాన్ని అభివృద్ధి చేశారు . మత విద్వేషాలను రెచ్చగొట్ట గలిగారు.

లౌకిక ప్రజాస్వామిక విలువలను బోధించే పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలి. లౌకికత, ప్రజాస్వామ్యం నిర్వచనాలే పరిమితంగా చెప్పబడ్డాయి. ఆ పరిమితమైన అర్థంలో కూడా లౌకికత అవసరం లేదంటున్నారు. ఆ పరిమితులకై వాటిని కాపాడవలసిన అవసరం ఉందని కొందరి అభిప్రాయం. లౌకిక ప్రజాస్వామిక విలువలను సంపూర్ణంగా సాధించవలసిన ఉందని మా అభిప్రాయం.

"ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు. ఎన్నికలలో గెలుపొందిన వారిని ప్రశ్నించే హక్కు ఎవరికీ లేదు. రాజకీయాలంటే ఓట్లు అడగడం. ఓట్ల వేయించుకోవటం. ఇదే ప్రజాస్వామం" అని చంద్రబాబు పదే పదే చెప్పాడు. ఇది చంద్రబాబు అభిప్రాయమేకాదు చాలామంది రాజకీయ నాయకుల అభిప్రాయం కూడా. ప్రజాస్వామ్యం అంటే ఇదేనా? నిర్వచించుకోవలసిన అవసరం ఉంది. అదే విధంగా లౌకికతను గురించి గాంధీజీ ఇలా అన్నారు" అన్ని మతాల వాళ్ళు ప్రచారం చేసుకోవటానికి సమాన అవకాశం ఉంది. ఈ దేశం ఒక మతానికి చెందినది కాదు. అన్ని మతాల వాళ్ళదీ." అయితే ఇదిలౌకిక వాదంలో ఒక చిన్న అంశం మాత్రమే అయితే దీనినే ప్రధానం చేశారు. ఈ పరిమితమైన నిర్వచానానికి కూడా న్యాయం జరగటంలేదు. మత ప్రచారం చేసుకొనే హక్కు, మతంలోనికి చేరే, చేర్చుకొనే హక్కును రాజ్యాంగం ప్రసాదించింది. కాని తమిళనాడు ప్రభుత్వం మత మార్పిడిని నిషేధించింది. దీనిని కోర్టులు కూడా సమర్థించాయి. రాజ్యాంగం ఇచ్చిన హక్కులు కూడా నిరాకరింపబడుతున్నాయి. మత మార్పిడికై నిషేధం ఎందుకంటే హిందూమతంలోనికి ఎవరూ రాలేదు. ఒకవేళ వస్తే ఏకులంలో చేరతారు? అది సాధ్యంకాని విషయం. కాబట్టి హిందూమతం నుండి బయటకు పోకుండా చెయ్యాలి. రాజ్యంగం ఏమి చెప్పినా వాళ్ళు చేసేవి చేయగలుగుతున్నారు.

పాఠ్యాంశాల ద్వారా, పాఠ్యాంశాలకు పరిమితం కాని బోధన ద్వారా మనం ఏ విలువలను బోధించగలుగుతున్నాం? పరిమితార్థంలో నైనా లౌకిక ప్రజాస్వామిక భావాలను బోధించగలుగుతున్నామా? లౌకిక ప్రజాస్వామిక విలువలను బలంగా పెంపొందించాలంటే చరిత్రనూ, సాహిత్యాన్ని ఆలంబనగా చేసుకోవాలి. వీటిని ఏ విధంగా బోధిస్తున్నాం. ఎలా వ్యాఖ్యానిస్తున్నామో పరిశీలించాలి. సాహిత్యం పేరు మీద బ్రాహ్మణీయ విలువలను బోధించటం జరుగుతుంది. ఒకటో రెండో మినహాయింపులు ఉండవచ్చు. ఈ విలువలకు లోబడిన పాఠ్యాంశాలే ప్రధానంగా ఉంటాయి. చరిత్ర రచన హైందవ జాతీయ కోణం నుంచీ చేయటం సంఘపరివార్ మొదలు పెట్టినప్పటికీ, అంతకు ముందు కూడా చరిత్ర రచన, ప్రజాస్వామిక, లౌకిక విలువలను పెంపొందించేదిగా చేయబడలేదు.

సంఘపరివార్ ఆలోచనల ప్రకారం "ఈ దేశ చరిత్ర ఆర్యులతో ప్రారంభమైనది. అర్యులు ఈ దేశంవాళ్ళే బయట నుంచి రాలేదు." ఆర్యులు బయట నుంచి వచ్చారన్నది వాస్తవం. వాస్తవంతో వాళ్ళకు పనిలేదు. ఈ దేశంలో ముస్లింలు, క్రైస్తవులు పరాయివాళ్ళు కారు కాని వాళ్ళ ఆలోచనలు పరాయి దేశాలవి కనుక వాళ్ళను పరాయివాళ్ళు అని చెప్పాలి. ఆర్యులను కూడా పరాయివాళ్ళు అని ఎలా చెప్తారు? చరిత్రకారుల ప్రకారం ఆర్యులు భారతదేశం వైపు వ్యాపించే క్రమంలో ఆఫ్ఘనిస్తాన్‌లో ఉండగా వ్రాయబడింది ఋగ్వేదం. కాని సంఘపరివార్ దానిని అంగీకరించదు. ఆర్యులకు పూర్వమే భారత ఉపఖండంలో ఒక సంస్కృతి ఉన్నది. నాగరికత ఉన్నది అనే విషయాన్ని ఆర్.ఎస్.ఎస్. అంగీకరించదు. వారి అభిప్రాయం ప్రకారం హైందవమతం అనాది మతం. దీనిని ప్రచారం చేసింది ఆర్యులు. ఆర్య సంస్కృతి, వేదాలు హైందవ నాగరికత అద్భుతంగా వర్ధిల్లాయి. కులాలపైన, స్త్రీలపైన అణచివేత ఆనాడులేదు. ముస్లింలు దాడులు చేసి, బ్రాహ్మణులను చంపుతూ, స్త్రీలపై అత్యాచారాలు చేస్తూ బలప్రయోగంతో ఇస్లాంను నెలకొల్పారు. అప్పటిదాకా భర్తతో సమానంగా ఉన్న స్త్రీ ముస్లిం దాడులకు భయపడి భర్త యొక్క రక్షణలో చేరి బానిసయ్యింది. గుణంరీత్యా వర్గీకరించబడిన వర్ణవ్యవస్థ కులవ్యవస్థగా అప్పుడే మారింది. అని ఆర్.ఎస్.ఎస్. వాళ్ళు విశ్వసిస్తారు. హిందువులపై

ముస్లింల ఆధిపత్యం కొనసాగుతూ ఉండగా క్రైస్తవులు వచ్చారు. వాళ్ళు తమ ఆధిపత్యాన్ని నెలకొల్పారు. వారిద్దరి ఆధిపత్యం నుండి దేశాన్ని బయటపడ వేయటమే ఆర్.ఎస్.ఎస్ ప్రవచించే జాతీయవాదం. అధికారంలోకి వచ్చిన కాంగ్రెసు అదే దాస్యాన్ని కొనసాగించింది. ఇది స్థూలంగా సంఘపరివార్ ఆలోచన.

మిత్రులారా! మీరు మార్క్సును, అంబేద్కర్‌ను చదవకపోయినా ఫర్వాలేదు. కాని గోల్వాల్కర్‌ను చదవండి. దేశంలో ఏ ఆలోచనారీతి బలంగా వ్యాపిస్తుందో చూడండి. బి.జె.పి.కి వచ్చిన ఓట్లు మాత్రమే చూడొద్దు లౌకికవాదం పేరుతో అధికారంలోనికి వచ్చిన యుపిఏ ప్రభుత్వంలో కూడా ఇద్దరు ఆర్.ఎస్.ఎస్. వాళ్ళు ఉన్నారు. పైకి ఏమి చెప్పినా అంతరంగంలో మాత్రం కాషాయం నిండి ఉన్నవాళ్ళు ఈ దేశంలో చాలామంది ఉన్నారు. విశ్వవిద్యాలయాలలో అధికార యంత్రాంగంలో వ్యాపించి యున్నారు. అనేక జెండాల క్రింద ఉన్నారు. అనేక పదవులలో ఉన్నారు. వాళ్ళు ఎక్కడ ఉన్నా మనం వాళ్ళను గుర్తించగలగాలి. వాళ్ళ ఆలోచనారీతులను అర్థం చేసుకోగలగాలి. మన ప్రత్యర్థుల ఆలోచనలను తెలుసుకోగలగాలి. గోల్వాల్కర్ నుంచి నేటి దాకా సంఘపరివార్ ఆలోచనా ధోరణి ఏమీ మారలేదు. వాజ్‌పాయి మారాడని, మారుస్తాడనీ కొందరి అభిప్రాయం. ఇది పొరపాటు. టి.వి.ఛానెల్‌ను బట్టి మాట్లాడే దేశాన్ని బట్టి, ఏ విధంగా కావాలో ఆ విధంగా మాట్లాడగలిగే చాతుర్యం వాజ్‌పాయ్‌కి ఉంది.

మనదేశంలో ముస్లింలపై దాడులు చేయడం తప్పు అనే వారిలో కూడా ముస్లింలు మూర్ఖులు, అరబ్బులు దుర్మార్గులు అనే అభిప్రాయాలు బలంగా ఉన్నాయి. ఈ భావాలు ప్రపంచంలో బలమైన దేశాలవాళ్ళు విస్తృతంగా ప్రచారం చేయటం వలన వ్యాపించాయి. ఇండోనేషియా తరువాత అత్యధిక ముస్లిం జనాభాగల దేశం భారతదేశం. హిందువులు వారితో కలసిమెలసి ఉండాలి. వారి చరిత్రను సంస్కృతిని బోధించాలి. ప్రపంచంలో అత్యంత గొప్ప నాగరికత అరబ్బుల నాగరికత అని ఇంగ్లీషు చరిత్రకారులు కూడా ఒప్పుకుంటున్నారు. ప్రాచీన గ్రీకు సాహిత్యం, సైన్సు అరబ్బీ భాషలోనికి ఎప్పుడో తర్జుమా చేశారు. ముస్లిం అంటే fundamentalist అంటున్నారు. సౌదీ తప్ప అరబ్బు దేశాలన్నీ లౌకికరాజ్యాలే. సద్దాం నియంతే. కాని లౌకికవాది. మతనియంతకాదు. ఇస్లాంలో స్త్రీలకున్న ఇబ్బందులను తొలగించి పురుషులతో సమానంగా జీవించే అవకాశాలు కల్పించాడు. ఈ అంశాలు మనం పాఠ్యాంశాలలో బోధిస్తే ముస్లింలను, ఇస్లాంను సరిగ్గా అర్థం చేసుకొని, నిజమైన లౌకికవాదులుగా రూపొందుతారు. లౌకికవాదాన్ని బోధించాలంటే మనదేశ చరిత్రతో పాటు ఆసియాచరిత్ర, ప్రపంచచరిత్ర కూడా బోధించాలి.

మన దేశంలో లౌకికభావాలుగల చాలామంది అలా ఉంటున్నారంటే కారణం మంచితనమే కాని జ్ఞానంతో అవగాహనతో కాదు. ఆర్.ఎస్.ఎస్ చెప్పినట్లుగానే చరిత్రను హిందూయుగం, ముస్లింయుగం అనీ అంతకు ముందునుంచే బోధిస్తున్నాయి. ఘజనీయో, గోరీయో దాడిచేస్తే ముస్లింయుగం ప్రారంభ మయినట్లా? మెడమీద కత్తి బెట్టి బలవంతంగా మతమార్పిడి చేశారనే ప్రచారం ఉంది. కాని చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం బల ప్రయోగం కంటే వ్యాపారమే మతవ్యాప్తికి తోడ్పడింది. వాస్తవానికి ఇస్లాం వ్యాప్తి, వ్యాపారం వలన బాగా జరిగింది. సిబిఎస్ఇ సిలబస్‌లో వర్ణ్యావరణం గురించి మంచి పాఠ్యాంశాలున్నాయి. అదే స్థాయిలో లౌకికవాదాన్ని చరిత్రనూ బోధించవలసిన అవసరం ఉంది.

భారతదేశంలో లౌకికవాదం, ప్రజాస్వామ్యం రెండు ముడివడి ఉన్నాయి. ఇతరదేశాలలో కాథలిక్ చర్చి అజమాయిషీ రాజ్యంపై బలంగా ఉంది. ఆదేశాలలో లౌకికవాదం అంటే రాజ్యాన్ని చర్చి ప్రభావం నుంచి బయటపడవేయుట. భారతదేశంలో లౌకికవాదం అంటే అన్ని మతాల సహజీవనం రాజ్యానికి మతానికి సంబంధం లేకపోవటమే కాదు. "మనిషికి ఒక ఆధ్యాత్మిక అవసరం ఒకటి ఉంటే దానికే పరిమితం కావాలి. ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక జీవితంపై మతప్రమేయం ఉండరాదు." అనేది. లౌకికవాద నిర్వచనం కావా? దేశాన్ని బ్రాహ్మణీయ భావజాలం నుండి హైందవభావజాలం నుండి బయటపడేయాలి.

'ధర్మం' అనే భావన చాలా దుర్మార్గమయింది. దురదృష్టవశాత్తు దానిని Justice అని ఇంగ్లీషులో అంటున్నారు. Justice అంటే న్యాయం ధర్మం అంటే ఈ సృష్టి లేదా ప్రపంచంలో ప్రతి వస్తువుకు, ఒక స్థానం ఉంది. ఆ స్థానానికి కట్టుబడి ఉండటమే ధర్మం. ఈ భావన ఉన్నంతకాలం భారతదేశంలో ప్రజాస్వామ్యం రాదు. మనుషులందరూ ఒకటే. అంతా సమానమే. అందరికీ సమానమైన అవకాశాలు ఉండాలి అనే భావనలు ప్రజాస్వామ్యానికి కీలకమైనవి. సరిగ్గా వాటికి వ్యతిరేక మైనది 'ధర్మం'. ఎవరి స్థానం వారికి ఉంటుంది. దానికి కట్టుబడి ఉండటమే 'ధర్మం'. ఈ భావనపై విమర్శ మన పాఠ్యగ్రంథాలలో లేదు. ముస్లిములు భారతదేశాన్ని పరిపాలించినా దేశ ప్రజలందరినీ ఇస్లాంలోకి మార్చలేదు. అత్యధికశాతం హిందువులుగానే ఉన్నారు. భారతదేశంలోనికి వ్యవసాయ, పారిశ్రామిక రంగాలలో సాంకేతిక అభివృద్ధిని ముస్లింలు తెచ్చారనేది వాస్తవం. ఈ విషయాలను విద్యార్థులకు బోధిస్తే పరమతసహనం కలుగుతుంది. ఇది అందరి దేశం అనే అవగాహన పెరుగుతుంది. సామాజిక జీవితంపైన బ్రాహ్మణీయ, నిచ్చెనమెట్ల వ్యవస్థ, దాని విలువల ప్రభావాన్ని తొలగించాలి. పాఠ్యప్రణాళికలో ఎలా ప్రవేశపెట్టాలో ఆలోచించాలి. ఆర్ఎస్ఎస్ వాళ్ళు తమ సిద్ధాంతాలను ప్రవేశపెట్టారు. గోల్వాల్కర్ శక్తివంతమైన హైందవ జాతిని తయారు చేయాలన్నారు. బి.జె.పి. మొన్న ఎన్నికలలో అదే చెప్పింది. జాతి బలోపేతం కావాలంటే అందరూ పాలకవర్గానికి లోబడి ఉండాలి. అలా ఉండకపోతే జాతి బలహీనపడుతుంది. హిట్లర్ ఆర్యజాతి సిద్ధాంతం కూడా అదే. "ఇల్లు కట్టుకోవాలంటే క్రింద కొన్ని ఇటుకలుండాలి. పైన కొన్ని ఇటుకలు ఉండాలి. అన్ని ఇటుకలూ పైనే ఉండాలంటే ఇల్లు ఏమవుతుంది?" అని గోల్వాల్కర్ అన్నాడు. వాళ్ళ ఆలోచనారీతిని ప్రచారం చేస్తున్నారు. భారతదేశంలో లౌకికత, ప్రజాస్వామ్యం రెండూ విడదీయరానివి. రెండింటిని వ్యాపింప చేయడానికి ఉపాధ్యాయులు తమకుండే వెసులుబాటును వినియోగించుకోవాలి. తగిన సిలబస్ రూపకల్పనకు ఉపాధ్యాయ విద్యార్థి సంఘాలు నడుం కట్టాలి.

సంతాపం

ఎస్.ఎ.ఫక్రుద్దీన్,
ఎల్.ఎఫ్.ఎల్ హెచ్.ఎం
పులేటిపల్లి, సి.కె.పల్లి మండలం
అనంతపురంజిల్లా

28-2-04న పులేటిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులను విజ్ఞాన విహార యాత్రకు తీసికొని పోయి తిరిగి వచ్చేసమయంలో అనంతపురం జిల్లాచిలమత్తూరు మండలం లోని పులగూర్లపల్లి వద్ద వ్యాను, లారీ ఢీకొన్న యాక్సిడెంట్ నందు చనిపోయారు. ఈయన అనేక ఉపాధ్యాయ ఉద్యమాలలో ఏపిటిఎఫ్ సభ్యునిగా చురుకుగా పాల్గొన్నారు.

పదవీ విరమణ విరాళం

శ్రీ వై.ఆర్.వి. గణపతిరావు దంపతులు
కొమరాడ మండలం, విజయనగరంజిల్లా
'ఉపాధ్యాయ'కు విరాళం రూ. 1116/-